సాక్షి
మెదక్
ఆదివారం । 25 ఫిబ్రవరి । 2024



ఆశలు సజీవం

ఉమ్మడి జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు వృథా నీటి మళ్లింపు అంశం తెరపైకి వచ్చింది. వివరాలు 8లో ▸



ఆవాసం.. విద్యార్థులకు వరం

ఆ ఆవాసం పేద విద్యార్థుల పాలిట వరంగా మారింది. ఉత్తమ విద్యార్థులుగా వారిని తీర్చి దిద్దడమే ఈ విద్యాలయం ప్రధాన ఉద్దేశం. వివరాలు 9లో ▸

ఖాళీ పోస్టుల భర్తీ

మెదక్ కలెక్టరేట్: జిల్లా వైద్యారోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 52 పోస్టులు భర్తీ చేసినట్లు డీఎంహెచ్ఓ చందునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆరోగ్యశాఖ మిషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఈ నియామకాలు చేపట్టినట్లు వివరించారు.

న్యూస్‌రీల్

దత్తత చట్టబద్ధంగా ఉండాలి



ప్రజలతో మాట్లాడుతున్న జడ్జి అనిత

నర్సాపూర్: చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ అనిత హితవు పలికారు. శనివారం కోర్టులో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. దత్తత తీసుకోవాల్సిన వారు చట్ట ప్రకారం సంబంధిత అధికారుల నుంచి తీసుకోవాలని సూచించారు. స్థిరాస్తులు, తెల్ల పేపర్లు, బాండ్ పేపర్లపై క్రయ విక్రయాలు జరపవద్దన్నారు. గ్రామీణ ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కాగా వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు అలసత్వం వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలు పీఎల్‌సీ కేసులు పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాదులు స్వరూపరాణి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి: టీపీటీఎఫ్

మెదక్: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ.. రెండేళ్లుగా జీపీఎఫ్, జీఎల్ఐ బిల్లులు చెల్లించకుండా గత ప్రభుత్వం ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురి చేసిందని వాపోయారు. ఉపాధ్యాయులు తమ జీతాల్లో నుంచి దాచుకున్న డబ్బులను అవసరమైనప్పుడు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి ఉపాధ్యాయులకు రావాల్సిన బిల్లులు ఇచ్చి ఆదుకోవాని కోరారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్



మనోహరాబాద్(తూప్రాన్): ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్న 5 టిప్పర్లను సీజ్ చేశారు. శనివారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మనోహరాబాద్ మండలంలోని కూచారం శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో వెళ్లి టిప్పర్లను పట్టుకున్నామని తెలిపారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజ్ చేసిన టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడ మట్టి రవాణా జరిగినా తమ దృష్టికి తేవాలని సూచించారు.

మన రాజ్యాంగం గొప్పది



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: ప్రపంచంలోనే మన రాజ్యాంగం గొప్పదని అదనపు కలెక్టర్ రమేశ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో లెక్చర్ ఆన్ డెమోక్రసీ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కులం, మతం ఆధారంగా కాకుండా ఒక వ్యక్తికి ఒకే ఓటు విధానం ఇవ్వడం గొప్ప విషయమని కొనియాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో రాష్ట్రస్థాయిలో జిల్లా రెండో స్థానంలో నిలవడం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో స్తంభాలు, కరెంట్ తీగల మార్పులు, తదితర పనులు చేయనున్నందున ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మెదక్ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, పట్టణ ట్రాన్స్‌కో ఏఈ జావేద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, కలెక్టరేట్, ఎస్పీ ఆఫీస్, ఔరంగాబాద్, అవుసులపల్లిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

ఆ పల్లె.. కాయగూరల ముల్లె

అన్నిరకాల ఆకు, కూరగాయల సాగు

- ఆరుతడి పంటలతో లాభాలు
- ఆదర్శంగా నిలుస్తున్న గుట్టకిందిపల్లి వాసులు

సండే స్పెషల్

ఒకరిద్దరూ కాదు.. ఊరు ఊరంతా కూరగాయలు సాగుచేస్తున్నారు. గుంట మొదలు ఎకరా, రెండెకరాలు ఉన్న రైతులు కూరగాయలతో పాటు ఆకుకూరలు పండిస్తూ లాభాలు గడిస్తున్నారు. పెద్దగా నీటి వనరులు లేకపోయినా.. ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు 'సాగు'తున్నారు. తక్కువ సమయంలో చేతికి వచ్చే ఆరుతడి పంటలు సాగు చేస్తూ జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు మెదక్ మండల పరిధిలోని గుట్టకిందిపల్లి గ్రామ వాసులు.

– మెదక్

మెదక్ మండల పరిధిలోని మారుముల గ్రామం గుట్టకిందిపల్లి. ఆ ఊరిలో 232 నివాస గృహాలుండగా, 300కు పైగా ఎకరాల్లో వ్యవసాయ భూములు ఉన్నాయి. నీటి వనరులు ఆ ఊరికి పెద్దగా లేవు. చిన్నపాటి రెండు కుంటలు తప్ప సాగు నీరు ఎరుగని ఊరు అది. 500 నుంచి 600 ఫీట్లలోతు బోర్లు తవ్వినా చెప్పుకోదగ్గ నీటి ఊటలు లేవు. వచ్చే కొద్దిపాటి నీటితో ఆ గ్రామస్తులు ఆరుతడి పంటలు పండిస్తూ లక్షల ఆదాయం గడిస్తున్నారు.



ఒక్కో రైతు.. పది రకాలు

ఆ ఊరిలోని రైతులు అన్నిరకాల ఆకు, కూరగాయలు సాగు చేస్తున్నారు. టమాట, వంకాయ, పచ్చిమిర్చి, దోసకాయ, బీరకాయ, కొత్తిమీర, చిక్కుడు, ఉల్లి, అల్లం వెల్లుల్లి, మొక్కజొన్న, గోదుమ, పాలకూర, మెంతుకూర, బచ్చలికూర, తోట కూరతో పాటు అన్ని రకాలు సాగు చేస్తున్నారు. ఎకరంలో రూ.లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. రోజుకు 10 నుంచి 12 క్వింటాళ్ల కూరగాయలను మెదక్, నర్సాపూర్, జోగిపేట తదితర నియోజకవర్గాలకు తరలించి విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.



గుట్టకిందిపల్లిలో సాగుచేసిన కొత్తిమీర



ఇంటింటా పాడి గేదెలు

ఆ గ్రామంలో ఏ ఇంట చూసినా పాడి గేదెలు కనిపిస్తాయి. వ్యవసాయ పొలాల వద్ద వీటి కోసం గడ్డి విత్తనాలు నాటి పశువులకు మేతగా వేస్తున్నారు. వ్యవసాయంతో పాటు పశుపోషణ చేస్తూ పాలతో ఆదాయం పొందుతున్నారు. అంతేకాకుండా పశువుల పేడను సేంద్రియ ఎరువుగా ఉపయోగిస్తున్నారు. గొర్రెలను సైతం విరివిగా పెంచుతున్నారు. వాటితో వచ్చే ఆదాయంతో పాటు ఎరువులను పంట పొలాలకు వాడుతూ సేంద్రియ సాగుపై దృష్టి సారిస్తున్నారు. కోడి ఎరువును వినియోగిస్తూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తున్నారు.



పందుల నుంచి రక్షణకు చీరలు కట్టిన రైతులు

సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలి



గతంలో ఉద్యానవన శాఖ ద్వారా సబ్సిడీపై కూరగాయల విత్తనాలు ఇచ్చేది. ప్రస్తుతం వాటిని ఇవ్వడం మానేశారు. దీంతో వేలాది రూపాయలు వెచ్చించి విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సబ్సిడీ విత్తనాలతో పాటు డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు ఇచ్చి ఆదుకోవాలి.

– పిట్ల యాదగిరి, గుట్టకిందిపల్లి



ఆరుతడే జీవనాధారం

మా గ్రామంలో ఆరుతడి పంటలే జీవనాధారం. అన్నిరకాల ఆకు, కాయ కూరగాయలు సాగు చేస్తాం. నిత్యం మెదక్, నర్సాపూర్, జోగిపేట తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తాం.

– బయ్య నారాయణ, గ్రామస్తుడు

సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ అందజేయాలి



మా గ్రామంలో ఆరుతడి పంటలైన కూరగాయలు, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు లాంటి పంటలు సాగు చేస్తాం. మా గ్రామం పక్కనే అటవీ ప్రాంతం ఉండడంతో పందులు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ ఇచ్చి ఆదుకోవాలి.

– అంజమ్మ, గుట్టకిందిపల్లి

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- మార్చి నెలాఖరులోగా లక్ష్యం పూర్తి చేస్తాం
- 'సాక్షి'తో స్త్రీనిధి రీజినల్ మేనేజర్ గంగారాం



మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు స్త్రీనిధి రుణాలు అందిస్తున్నట్లు స్త్రీనిధి రీజినల్ మేనేజర్ గంగారాం పేర్కొన్నారు. శనివారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో మొత్తం 592 సమాఖ్యలు ఉండగా 16,104 మహిళా సంఘాలు ఉన్నట్లు తెలిపారు. వీటిలో మెప్మా పరిధిలో మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట ఉండగా 64 సమాఖ్యలు, 1,833 డ్వాక్రా గ్రూపులు 20,341 మంది సభ్యులు ఉన్నట్లు చెప్పారు. అలాగే సెర్ప్ పరిధిలో జిల్లాలోని 17 మండలాలు ఉండగా 528 సమాఖ్యలు 14,271 గ్రూపులు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు మెప్మా పరిధిలోని సమాఖ్యలకు రూ.7.98 కోట్ల రుణాలు చెల్లించాలనే టార్గెట్ ఉండగా రూ.2.32 కోట్లు చెల్లించినట్లు వివరించారు. ఒక్క మెదక్ మున్సిపాలిటీ మాత్రమే వాటాధనం చెల్లించడంతో స్త్రీనిధి రుణాలు అందజేసినట్లు చెప్పారు. మిగితా మున్సిపాలిటీలు వాటాధనం చెల్లించకపోవడంతో రుణాల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. అలాగే జిల్లాలో సెర్ప్ పరిధిలో 528 సమాఖ్యలకు రూ.70.18 కోట్లు చెల్లించాలనే టార్గెట్ ఉండగా ఇప్పటివరకు రూ.42.95 కోట్ల రుణాలు అందజేసినట్లు తెలిపారు. ప్రత్యేక అనుమతి తీసుకొని మార్చి నెలాఖరులోగా లక్ష్యం మేరకు అన్ని సమాఖ్యలకు రుణాలు పంపిణీ చేస్తామని వెల్లడించారు. స్వయంగా వ్యాపారాలు నడుపుతున్న మహిళా సంఘాల సభ్యులకు వారి వ్యాపార అభివృద్ధికి రూ. 3 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

బగలాముఖి ఆలయంలో ప్రత్యేక పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ ఆలయంలో శనివారం మాసపౌర్ణమి పూజలు నిర్వహించారు. వేద పండితుడు, ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తులు ఇబ్బంది పడొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

- కలెక్టర్ రాజర్షిషా
- ఏడుపాయల జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

మెదక్ కలెక్టరేట్: ఏడుపాయల జాతరకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. జాతర ఏర్పాట్ల ప్రగతిపై శనివారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి 8, 9, 10 తేదీల్లో నిర్వహించే జాతరకు గతం కంటే ఎక్కువగా భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రోజువారీ షిఫ్టుల ప్రకారం సిబ్బందికి విధులు కేటాయించి పాసులు జారీ చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి బస్సులు నడపాలని సంబంధిత అధికారులకు చెప్పారు.

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

జిల్లావ్యాప్తంగా మున్సిపల్, గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తాగునీటి కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌పై జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తాగునీటి ఎద్దడి రాకుండా ఉండడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఏ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి మద్దతుగా నిలవండి

కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల



మాట్లాడుతున్న పురుషోత్తం రూపాల

నర్సాపూర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా నిలవాలని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల ప్రజలను కోరారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం రాత్రి బస్టాండ్ సమీపంలో నిర్వహించిన సభలో పాల్గొని మాట్లాడారు. దేశంలోని అన్ని పార్టీల నాయకులు తమ కుటుంబాల కోసం పని చేస్తుంటే ప్రధాని మోదీ దేశం కోసం పనిచేస్తున్నారని కొనియాడారు. మోదీ పదేళ్ల పాలనలో శత్రువులు సైతం ఆయనను ప్రశంసించారని తెలిపారు. ప్రపంచ దేశాల్లో మన దేశ గౌరవం, ప్రతిష్ట పెంపొందించారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో అధికారులు ప్రభుత్వ భూములను ధనికులకు కట్టబెట్టారని మండిపడ్డారు. జిల్లాకు చెందిన ఓ అధికారి నర్సాపూర్ నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన భూములను అక్రమంగా పట్టా చేసిన ఘటనలో ఇరుక్కొని జైలుకు వెళ్లారని గుర్తుచేశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో తిరకాసుపెడుతుందని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రఘువీరారెడ్డి, కరణం పరణిత, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం




మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ కలెక్టరేట్/మెదక్ మున్సిపాలిటీ: మార్చి 9వ తేదీన జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టులో ఎస్పీ, జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీ కుదుర్చుకునే కేసుల్లో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునే విధంగా పోలీస్ అధికారులు సహకరించాలన్నారు. సమావేశంలో ఎస్పీ బాలస్వామి, సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రిటా లాల్చంద్, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఇదే విషయమై ఎస్పీ డాక్టర్ బాలస్వామి జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజీపడే కేసుల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి వారికి వివరించారు.

తెరపైకి 'బీసీ' నినాదం

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అన్ని పార్టీల్లోనూ డిమాండ్
- ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న నాయకులు



మెదక్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో అన్ని పార్టీల్లో బీసీ నినాదం ఊపందుకుంటోంది. మెదక్ టికెట్‌ను బీసీలకే కేటాయించాలనే డిమాండ్ అంతకంతకూ పెరిగిపోతోంది. అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్, బీజేపీలో కూడా బీసీలు టికెట్ కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మెజారిటీ ఓటర్లు వెనుకబడిన కులాల వారే కావడంతో ఈసారి ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. టికెట్ ఆశిస్తున్న నేతలు ఆయాపార్టీల అగ్రనేతలను ఒప్పించేందుకు బీసీ సంఘాలు, నాయకుల మద్దతు కూడగడుతున్నారు. గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో బీజేపీ బీసీలకు ఆరు టికెట్లు కేటాయించగా.. కాంగ్రెస్ రెండు, బీఆర్‌ఎస్ ఒకరికి టికెట్ ఇచ్చింది.

హస్తం పార్టీలో పోటాపోటీ

రాష్ట్రంలో అధికారం సాధించిన జోష్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికే 11 మంది టికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా.. మిగితా వారు సైతం అడుగుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో టికెట్ వస్తే చాలు గెలుపు ఖాయం అన్న ధీమాతో ఆశావహులు ఉన్నారు. అయితే మెదక్ ఎంపీ టికెట్‌ను మాత్రం తమకే కేటాయించాలని బీసీలు పట్టుబడుతున్నారు. ఒకవేళ బీసీలకు కేటాయిస్తే తనకే ఇవ్వాలని ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన నీలం మధు ముదిరాజ్ అధిష్టానాన్ని కోరుతున్నారు. బీసీలకు కేటాయించని పక్షంలో మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాంగ్రెస్‌లో ప్రస్తుతం వీరిద్దరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

బీఆర్‌ఎస్‌లో జోరుగా ప్రయత్నాలు

బీఆర్‌ఎస్‌లో సీనియర్ నేతలు గాలి అనిల్ కుమార్, బీరయ్యయాదవ్, సత్యనారాయణ, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మెదక్ ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నారు. పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరుగా అనిల్‌కుమార్ ఉన్నారు. బీసీలకు కేటాయిస్తే అనిల్ కుమార్‌కే ఎక్కువ అవకాశాలు ఉంటాయని బీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నాయి. 2018 ఎన్నికల సమయంలో పటాన్‌చెరు బీఆర్‌ఎస్ టికెట్ రాకపోవడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున మెదక్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ టికెట్ ఇవ్వలేదని కాంగ్రెస్‌కు రాజీనామా చేసి తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సమయంలో మెదక్ ఎంపీ టికెట్‌ను ఇస్తామని అనిల్‌కుమార్‌కు బీఆర్‌ఎస్ అధిష్టానం హామీ ఇచ్చింది. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఒక్క మెదక్ అసెంబ్లీ సెగ్మెంట్ మినహా మిగిలిన ఆరు చోట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే గెలిచారు. ఇక్కడ టికెట్ దక్కించుకుంటే సునాయాసంగా గెలుస్తామనే ధీమాతో బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు.

బీజేపీ చూపు ఎటువైపో..

ఇక భారతీయ జనతా పార్టీలో బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆకుల రాజయ్య ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నారు. ఆయనతో పాటు దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, గురువారెడ్డి తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ టికెట్లు ఇచ్చిన బీజేపీ అధిష్టానం లోక్‌సభ ఎన్నికల్లో ఏ సామాజికవర్గం వైపు మొగ్గు చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది.

సాక్షి
మెదక్
సోమవారం ၊ 26 ၊ ఫిబ్రవరి ၊ 2024

న్యూస్‌రీల్

ఏసయ్యా.. కరుణించు



ప్రార్థన చేస్తున్న భక్తులు

మెదక్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ప్రెస్బెటరీ ఇన్ చార్జి శాంతయ్య భక్తులకు దైవ సందేశం ఇచ్చి ఆశీర్వదించారు. కాగా దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

నర్సాపూర్: కోర్టు కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపి ఉపాధ్యాయుల పదోన్నతుల్లో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షతన నర్సాపూర్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు కరువు భత్యాలు మంజూరు చేయాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడంతో పాటు ఉపాధ్యాయుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి, ప్రధాన కార్యదర్శి పద్మారావు, ఉపాధ్యక్షుడు అజయ్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: వైద్యశాఖలో ఉద్యోగాల భర్తీకి నేటి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఎంహెచ్ఓ చందునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో జాతీయ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఖాళీలను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి, అర్హత గల వారు ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం




కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గ అభివృద్ధితోపాటు ప్రజల సంక్షేమమే లక్ష్యమని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం ఖేడ్ మండలం ర్యాకల్, తుర్కపల్లిల్లో రూ.10.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేసి, హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 122 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ, గ్రామాలు, తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ కండువాలు వేసుకుంటేనే నేతలు పథకాలను వర్తింపజేశారని విమర్శించారు. తాము పార్టీలకతీతంగా అర్హులైన వారికి స్కీములు వర్తింపజేస్తున్నామన్నారు. ముఖ్య నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, వినోద్‌పాటిల్, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి అవిశ్వాసం వాయిదా

జిన్నారం(పటాన్‌చెరు): తనపై పెట్టనున్న అవిశ్వాసం తీర్మాన సమావేశాన్ని నిలిపేయాలని ఎంపీపీ రవీందర్‌గౌడ్ కోర్టును ఆశ్రయించారు. దీంతో స్టే ఇచ్చింది. ఈనెల 26న జరగాల్సిన అవిశ్వాస సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు అధికారులు ఎంపీటీసీలకు నోటీసులను అందించారు. దీంతో మండల రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అవిశ్వాసంపై స్టేను ఎత్తివేసేందుకు కోర్టుకు వెళ్లే యోచనలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని ఈనెల 27న వచ్చిన తర్వాత తగిన నిర్ణయం తీసుకుంటామని ఎంపీటీసీ సభ్యులు ఒకరు సాక్షికి చెప్పారు. అయితే బీఆర్ఎస్ ఎంపీటీసీలు పది రోజుల పాటు క్యాంపునకు వెళ్లారు.

అలుగు పారుతున్న 'హల్దీ'



కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీ కాల్వలోకి ప్రభుత్వం నీటిని విడుదల చేయడంతో మాసాయిపేట్ మండలం హకీంపేట్, కొప్పులపల్లి గ్రామ శివారులో ఉన్న హల్దీ ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - వెల్దుర్తి(తూప్రాన్)





క్యూలైన్‌లో భక్తుల రద్దీ (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

'వనం' నిండా భక్త జనం

ఏడుపాయల వనదుర్గా భవానీ సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పూజారులు దుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోసి, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వనంలో టెంట్లు వేసుకొని విందు చేసుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. - పాపన్నపేట(మెదక్)

మహిళలకు అభయం

మహిళా సంఘాలకు వడ్డీ చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం

- పెండింగ్‌లో రూ.117.64 కోట్ల బకాయిలు
- జిల్లాలో 1.38 లక్షల మంది సభ్యులకు మేలు



మెదక్: మహిళా గ్రూపు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వడ్డీని చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రూ.117.64 కోట్ల బకాయిలకు మోక్షం కలగనుంది. వీటి ద్వారా 1.38 లక్షల మంది మహిళా గ్రూపు సభ్యులకు లబ్ధి చేకూరునుంది.

జిల్లావ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలు (ఎస్ఎహెచ్‌జీ) 13,051 ఉండగా వాటిలో 1,38,000 మంది సభ్యులు ఉన్నారు. వీరు బ్యాంకు లింకేజీల ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి వడ్డీతో చెల్లించగా ఆ వడ్డీని మహిళలకు చెల్లించాల్సి ఉంది. కానీ నాలుగేళ్లుగా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న వడ్డీని తిరిగి చెల్లిస్తామని తెలిపింది. 2019 నుంచి 2023 వరకు జిల్లావ్యాప్తంగా రూ.1,360 కోట్లు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు తీసుకున్న మహిళలు క్రమం తప్పకుండా వాయిదాల పద్ధతిలో తిరిగి బ్యాంకులకు చెల్లించారు. కాగా మహిళలకు వడ్డీ రూపంలో రూ.177.64 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంపై జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా ఆదేశాలు రాలేదు

మహిళా స్వయం సహాయక సంఘాలకు నాలుగేళ్ల వడ్డీ చెల్లించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి జిల్లావ్యాప్తంగా రూ.117.64 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే వారి అకౌంట్లలో వడ్డీ డబ్బులు జమ చేస్తాం.

– సూర్యారావు మెదక్ డీఆర్‌డీఓ

ఆర్థికంగా ఎదుగుదల



స్వయం సహాయక (ఎస్‌హెచ్‌జీ) గ్రూపు సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకర్లు ఒక్కో గ్రూపు సభ్యురాలికి కనిష్ఠంగా రూ. లక్ష నుంచి గరిష్ఠంగా రూ. 4 లక్షల వరకు రుణాలు ఇస్తోంది. రుణాలు పొందిన మహిళలు చిన్నపాటి వ్యాపారాలను ఎంచుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇందులో బ్యాంకుల ద్వారా గ్రూపు సభ్యులకు రుణాలు ఇస్తుండగా.. శ్రీనిధి ద్వారా ప్రత్యేకంగా ఒక్కో సభ్యురాలికి రుణాలు అందజేస్తున్నారు. ఇందులో చిన్నపాటి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సైతం ప్రోత్సహిస్తున్నారు. ఈ సంవత్సరం 6,520 మంది సభ్యులకు వారు కోరుకున్న వ్యాపారానికి రుణాలు అందించారు. రుణాలు పొందిన సభ్యులు తిరిగా వాయిదాల పద్ధతిలో సకాలంలో బ్యాంకర్లకు వడ్డీతో సహా చెల్లిస్తున్నారు. దీంతో జిల్లాలో మహిళా గ్రూపు సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. పట్టణ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో ఈ రుణాలు ఇస్తుండగా గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ ద్వారా అందజేస్తున్నారు.

ఒంటరిగానే బీజేపీ పోటీ



టిక్యా తండాలో గిరిజనులతో కలిసి రొట్టెలు తింటున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నర్సాపూర్/శివ్వంపేట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రఘునందన్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ, బీ ఆర్ఎస్ కలిసి పోటీ చేస్తాయని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాము ఒంటరిగానే 17 స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. హరీశ్‌రావు హయాంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు నిర్మించారే తప్ప పేదలకు అవసరమైన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ల మధ్య వ్యాపార సంబంధాలు ఉన్నాయన్నారు. మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ ఒకే కోవకు చెందినవని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ సారయ్య, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజయ సంకల్ప యాత్రలో భాగంగా శివ్వంపేట మండల పరిధిలోని టిక్యా తండా వాసులతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. దేశంలో గిరిజనులకు గుర్తింపునిచ్చిన ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. దేశంలో వెనుకబడిన వర్గాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రధాని మోదీ ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు.

ఉప్పొంగిన భక్తిభావం



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

కొమురవెల్లి (సిద్దిపేట): మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరోవారమైన ఆదివారం కొమురవెల్లికి భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలన్నీ మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. జిల్లా నుంచే కాకుండా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. స్వామి దర్శనానికి తెల్లవారుజామునుంచే బారులు తీరారు. గంగిరేణి చెట్టు వద్ద పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ది శ్రీనివాసు, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఒగ్గు పూజారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లడ్డూ ప్రియం

మల్లికార్జున స్వామి లడ్డూ ప్రసాదం ధర పెరిగింది. 100 గ్రాముల లడ్డూను రూ.20కి విక్రయించేవారు. ఆదివారం నుంచి రూ.25 పెంచారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ధర పెంచినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.


చి'వరి'కి కన్నీరే మిగిలింది



నార్సింగి మండలం నర్సంపల్లి శివారులో ఎండిన వరి పంటను మేస్తున్న జీవాలు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట, నార్సింగి మండలాల్లోని పలు గ్రామాల్లో వరి వేసిన రైతుల అంచనా తప్పింది. నెల రోజుల వ్యవధిలోనే భూగర్భ జలమట్టం భారీగా తగ్గిపోయి బోర్లలో నీరు అడుగంటింది. దీంతో వరి పైర్లు ఎండుముఖం పట్టాయి. చివరికి చేసేదేమిలేక పంటలను జీవాలకు మేతగా పెడుతున్నారు. కళ్ల ముందే ఎండిపోతున్న పంటను చూసి కన్నీళ్లు పెడుతున్నారు. కాళేశ్వరం కాలువ నీరు వచ్చి ఉంటే నీటి బాధలు తప్పేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాహిత్య అకాడమీ పోటీలకు ఎంపిక



భువనేశ్వర్

పాపన్నపేట(మెదక్): అన్నమయ్య జాతీయ సంగీత సాహిత్య అకాడమీ పోటీలకు ఉప్పరి భువనేశ్వర్ ఎంపికయ్యారు. తెలంగాణ, ఏపీ అన్నమయ్య సంగీత సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో తిరుపతిలో ఆదివారం పోటీలు నిర్వహించగా పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్‌పేటకు చెందిన భువనేశ్వర్ ప్రతిభ చాటారు. ఈ మేరకు జూలై 26వ తేదీన న్యూఢిల్లీలో జరిగే సాహిత్య పోటీల్లో ఆయన పాల్గొంటారు. మండల వాసులు ఆయనను అభినందించారు.

ట్రిపుల్‌ఆర్‌లో మరో ముందడుగు

త్వరలో త్రీజీ నోటిఫికేషన్


- అధికారుల సన్నాహాలు
- 980 ఎకరాల సేకరణకు రంగం సిద్ధం
- రైతుల అభ్యంతరాల స్వీకరణ
- పరిహారం లెక్కలు తేల్చే అవకాశం
- ఇప్పటికే యాదాద్రి-భువనగిరి డివిజన్‌కు విడుదల

గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగు రోడ్డు) భూసేకరణకు సంబంధించిన త్రీజీ నోటిఫికేషన్ త్వరలో విడుదల కానున్నది. భూముల స్వాధీనానికి సంబంధించి ఇది తుది నోటిఫికేషన్‌గా చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను సంబంధిత అధికారులు దాదాపు పూర్తి చేశారు. ఇప్పటికే యాదాద్రి-భువనగిరికి సంబంధించిన త్రీజీ నోటిఫికేషన్ పూర్తికావడంతో ఇక గజ్వేల్‌పై దృష్టి సారించారు. దీంతో ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం పనుల్లో కీలక ముందడుగు పడినట్లయ్యింది.

గజ్వేల్: ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) భూసేకరణ ప్రక్రియను రెవెన్యూ డివిజన్ల వారీగా పూర్తి చేయడానికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు వేగిరం చేస్తున్నారు. ఇప్పటికే ఉత్తర భాగంలో ఈ రోడ్డు నిడివి 158 కిలోమీటర్లు కాగా ఇందులో వంద కిలోమీటర్లకుపైగా ఉమ్మడి మెదక్ జిల్లాలో విస్తరించనుంది. భూసేకరణను సులభతరం చేయడానికి రెవెన్యూ డివిజన్ల వారీగా కాలా (కాంపీటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజైషన్)లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని మొత్తంగా అయిదు కాలాల పరిధిలోని 54కిపైగా గ్రామాల్లో 4,500 ఎకరాల వరకు భూసేకరణ జరగనుంది. ఇవీ కాకుండా ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో చౌటుప్పల్, యాదాద్రితోపాటు భువనగిరికి ప్రత్యేకంగా కాలాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 14న యాదాద్రి-భువనగిరి కాలా పరిధిలో 460 ఎకరాల భూసేకరణ కోసం త్రీజీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన అధికారులు ఇక గజ్వేల్ కాలాపై దృష్టి సారించారు.

32 కిలోమీటర్ల మేర..

గజ్వేల్ రెవెన్యూ పరిధిలో పరిధిలో 32 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరగనుండగా, ఈ డివిజన్ పరిధిలోని జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి, ఇటిక్యాల, అలిరాజపేట, మర్కూక్ మండలం అంగడికిష్టాపూర్, చేబర్తి, ఎర్రవల్లి, పాములపర్తి, గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్, ముట్రాజ్‌పల్లి, సంగాపూర్, మక్తమాసాన్‌పల్లి, బంగ్లావెంకటాపూర్, వర్గల్ మండలం మైలారం, జబ్బాపూర్, నెంటూర్, రాయపోల్ మండలం బేగంపేట, ఎల్కల్ గ్రామాల్లో మొత్తంగా 980 ఎకరాల భూసేకరణ జరగనుంది. ఉత్తర భాగం పరిధిలో అత్యధికంగా ఇక్కడే భూసేకరణ జరగనున్నది. త్రీజీ నోటిఫికేషన్ తర్వాత అధికారులు భూములు కోల్పోతున్న రైతుల వద్ద నుంచి పరిహారాల పంపిణీకి సంబంధించిన అభ్యంతరాలను స్వీకరించడం, నోటీసులు ఇవ్వడం, పరిహారం తేల్చి రైతులకు తెలియజేయడం వంటి పనులు ఊపందుకోన్నాయి. అధికారులు ఇక క్షేత్రస్థాయిలో కార్యాచరణను ముమ్మరం చేయనున్నారు. దీని ద్వారా ట్రిపుల్‌ఆర్ పనులకు సంబంధించి కీలక ముందడుగు పడనున్నది.



రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం మ్యాపు

భూసేకరణపై ప్రత్యేక దృష్టి

ట్రిపుల్‌ఆర్‌కు సంబంధించి ప్రస్తుతం భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాం. ఉత్తర భాగంలోని అన్ని 'కాలా'ల పరిధిలో ఈ ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే యాదాద్రి-భువనగిరికి సంబంధించిన నోటిఫికేషన్ పూర్తి చేస్తాం. రైతుల వద్ద నుంచి పరిహారాలకు సంబంధించిన అభ్యంతరాలు స్వీకరించి మిగతా ప్రక్రియను పూర్తి చేయనున్నాం. గజ్వేల్‌లోనూ ఇదే తరహాలో భూసేకరణను చేపట్టనున్నాం.

– తోసిఫ్, ఎన్‌హెచ్ఏఐ డిప్యూటీ మేనేజర్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు 25 మంది ఎంపిక

- ఉత్సాహంగా జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు
- పాల్గొన్న 80 మంది క్రీడాకారులు



పోటీలను ప్రారంభిస్తున్న నాగరాజు

రామాయంపేట(మెదక్): రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ఆదేశాల మేరకు రామాయంపేటలో ఆదివారం జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. అండర్ 14, 17 విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించగా, జిల్లా యువజన, క్రీడా అధికారి నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 80 మంది క్రీడాకారులు పాల్గొనగా 25 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మార్చి తొమ్మిది, పది తేదీల్లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నాగరాజు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రామాయంపేటలో ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ ఏర్పాటు చేశామని, చాలా మంది క్రీడాకారులు ప్రతిరోజూ శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కోచ్ యాదగిరి, ధ్యాన్ చంద్ పీఈటీ ల సంఘం సభ్యులు శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్టస్థాయిలో ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న కారుణ్య

తూప్రాన్: అక్షర కౌముది సాహిత్య సాంస్కృతిక సంస్థ 4వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాష్ట్ర స్థాయిలో 'బాలసాహిత్యం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించగా గీతా స్కూల్ విద్యార్థిని సీ.హెచ్.కారుణ్య ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఆదివారం మల్కాజిగిరిలోని సమతా గోపాల్ కళా నిలయంలో జరిగిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి వురిమళ్ళ సునంద చేతుల మీదుగా అందుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ పీ.రామాంజనేయులు, చైర్ పర్సన్ పీ.ఉష, ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకట కృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్, విద్యార్థినిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



నిర్మల మృతదేహం

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని వడియారం శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాకకు చెందిన కారగంటి నిర్మల(38) కిషన్ దంపతులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వీరిద్దరూ ఓ శుభకార్యం నిమిత్తం కామారెడ్డి జిల్లా పెద్దమల్లారెడ్డికి వెళ్లి బైక్‌పై తిరిగి హైదరాబాద్ వెళ్తున్నారు. వడియారం బైపాస్ చౌరస్తా సమీపంలో వెనుక నుంచి డీసీఎం బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన నిర్మల అక్కడికక్కడే మృతి చెందింది. గాయాలైన కిషన్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఘాటెక్కిన ఎండు మిర్చి

కిలో ధర రూ.170 నుంచి 220

- జోగిపేట సంత రోజుల్లో జోరుగా అమ్మకాలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు

జోగిపేట(అందోల్): ఎండు మిర్చి ధర ఘాటెక్కిస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటుండడంతో ఎండు మిర్చి ధర అమాంతంగా పెరిగిపోయింది. పెరిగిన ధరలను చూసి ప్రజలు విస్తుపోతున్నారు.

నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణంలో మార్కెట్ గంజ్ వద్ద ఆది, బుధవారాలు రద్దీ ఎక్కువగా ఉంటోంది. హైదరాబాద్, చౌటకూరు, డాకూరు, చందూరు ప్రాంతాలకు చెందిన రైతులు ఎండు మిర్చిని వాహనాలపై తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. ప్రత్యేకంగా గుడారాలు వేసుకొని పంటను కుప్పలుగా పోసి అమ్ముతున్నారు. బహిరంగ్ మార్కెట్‌లో కిలో ధర రూ.170 నుంచి రూ.220 వరకు పలుకుతోంది. అయితే కొంత మంది రైతులు ట్రాక్టర్లపై తీసుకొచ్చి ట్రాలీలోనే ఉంచి విక్రయిస్తున్నారు. రెండు రోజులపాటు విక్రయాలు జరుపుతున్నట్లు తెలుసుకున్న అందోల్, పుల్కల్, అల్లాదుర్గం ప్రాంతాలకు చెందిన ప్రజలు వందల సంఖ్యలో వచ్చి కొంటున్నారు. ప్రతీ సీజన్‌లోనూ ఈ విక్రయాలు జోరుగా సాగుతాయి.



పొలాల వద్దనే విక్రయాలు

చౌటకూరు మండల రైతులు సైతం మిర్చి పంట ఎక్కువగా పండిస్తారు. కానీ ఐదేళ్ల నుంచి వరినే ఎక్కువగా సాగు చేస్తున్నారు. అయినా ఈ ప్రాంత మిర్చికి మంచి ఆదరణ ఏ మాత్రమూ తగ్గలేదు. ఇక్కడ కొనుగోలు చేసే మిరప కాయలు ఘాటుగా ఉంటాయని పొలం వద్దనే విక్రయాలు జరుగుతుండటం విశేషం. అందోల్ మండలం డాకూరు, చిలప్ చెడ్ మండలం చందూరు గ్రామాల్లోనూ పంట వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తుంటారు. ఈసారి చాలా వరకు రైతుల వరిసాగుపై మొగ్గు చూపడంతో మిరప సాగు భారీగా పడిపోయింది. దీంతో మార్కెట్‌లో రేటు అమాంతం పెరిగిపోయింది.

భారీగా పెరిగాయి



ఈ సంవత్సరం ఎండు మిర్చి ధరలు బాగా పెరిగాయి. రూ.150 కిలో చొప్పున ఇవ్వాలని అడిగినా వ్యాపారులు ధరలు తగ్గించడం లేదు. కిలో ధర రూ.180.. 200.. 220లు అంటున్నారు. గతేడాది కంటే ఈ సంవత్సరం ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. తగ్గించమంటే తాము దూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నామని, ట్రాన్స్‌పోర్టు ఖర్చులే ఎక్కువ అవుతాయని అంటున్నారు. ఇది తప్పనిసరి వస్తువు కాబట్టి ఎంత ధరకైనా పెట్టి కొనాల్సి వస్తోంది.

– మొగులయ్య, రైతు, తాడ్మన్నూర్ గ్రామం

పంటకు తెగుళ్లు.. ఆందోళనలో రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మిర్చి పంటకు తెగుళ్లు సోకుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మిర్చి పంటకు నల్లతామర, ఎర్రనల్లి, పచ్చదోమ, కుచ్చు ముడత, బూ డిద తెగులు వంటి పలు రోగాలతో పంట దెబ్బతింటుందని, తెగుళ్ల ఉధృతితో పూత, కాయ రాలిపో యి మొక్క వాలిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నకోడూరు మండల వ్యాప్తంగా అధికారుల అంచనా ప్రకారం 400 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేస్తున్నట్లు సమాచారం. గతేడాది మిర్చికి మంచి ధర ఉండడంతో ఈ సారి కూడా మిర్చి పంట సాగుకు రైతులు మొగ్గు చూపారు. తీరా చీడపీడ, తెగుళ్లతో రైతులు కోలుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ సీజన్‌లో ఎప్పుడు సాగు చేసే మిర్చి విత్తనాలు మార్కెట్‌ల అందుబాటులో లేకపోవడంతో ఇతర కంపెనీ విత్తనాలతో పంట సాగు చేశామని రైతులు పేర్కొంటున్నారు.



తెగుళ్లను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

పూత రాలిపోతోంది..

30 గుంటల్లో మిర్చి పంటను సాగు చేశాను. పెట్టుబడులు సుమారు రూ. 25 వేలు ఖర్చు అయ్యింది. పంటకు తెగుళ్లు సోకడంతో పురుగులు మందు కొట్టాను. మొక్క ఎదుగుదల లేక పూత రాలిపోతోంది. ఎన్ని మందులు కొట్టినా ఫలితం లేదు. పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు.

– నాగరాజు, రైతు, చిన్నకోడూరు

ఉద్యోగాల పేరిట మోసాలు

రూ.2.37 లక్షలు పోగొట్టుకున్న బాధితులు

సిద్దిపేటకమాన్: పార్ట్ టైం ఉద్యోగం, ఆర్మీలో ఉద్యోగం ఉందంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్‌లు, మెసేజ్‌లకు స్పందించి బాధితులు డబ్బులు పోగొట్టుకున్నారు. ఈ ఘటన సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో చోటు చేసుకుంది. సీపీ అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆర్మీలో ఉద్యోగం వచ్చిందని తెలిపాడు. అందుకోసం ల్యాప్‌టాప్, మానిటర్ ఇతర వస్తువులు కొనుగోలు చేయాలని సూచించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్‌లో రూ.77,800 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ రావడంతో జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న రూ.40 వేలు ఫ్రీజ్ చేశారు. మరో ఘటనలో సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఓ వ్యక్తికి టెలిగ్రాం యాప్‌లో పార్ట్ టైం ఉద్యోగం అని ఓ యాప్‌ను పంపించారు. లింకు ఓపెన్ బాధితుడు వివరాలు నమోదు చేయగానే అమెజాన్ ప్రొడక్ట్ లింకుకు యాడ్ చేసినట్లు ఓ స్క్రీన్ షాట్ బాధితుడి ఫోన్‌కు వచ్చింది. అందులో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి రూ.1,60,120 పంపించాడు. తర్వాత లింకు ఓపెన్ చేయగా బ్లాక్ చేసి ఉండడంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న రూ.87,800 ఫ్రీజ్ చేశారు.

విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి

విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల ముగ్గురు మృతి చెందారు. కొండపాకలో ఇంటిపై బట్టలు ఆరేస్తుండగా గీత కార్మికుడు, సిద్దిపేటలో వెంచర్‌లో పని చేస్తున్న వలసకూలీ, మర్కుక్‌లో యువకుడు మృతి చెందారు.



పరశురాములు (ఫైల్)

కొండపాక(గజ్వేల్): విద్యుదాఘాతంతో గీత కార్మికుడు మృతి చెందిన ఘటన కొండపాకలో చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జప్తినాచారం గ్రామానికి చెందిన వడ్లకొండ పరశురాములు గౌడ్(46) రోజు మాదిరిగా శనివారం రాత్రి వరకు గీత వృత్తి పనిని ముగించుకొని ఇంటికొచ్చాడు. బాత్‌రూమ్‌లో స్నానం చేసి బట్టలను ఇంటి పై కప్పు మెట్ల వద్ద ఆరేస్తుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే 108 అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూడు నెలల్లో పెళ్లి అనగా..



రాజు లిల్వారే (ఫైల్)

సిద్దిపేటకమాన్: విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజు లిల్వారే (25) తన సోదరుడు, మిత్రులతో కలిసి వలసవచ్చి సిద్దిపేటలోని ఓ ప్రైవేటు వెంచర్‌లో కూలీ పనులు చేస్తున్నారు. వెంచర్ నిర్వాహకులు తమ వెంచర్ ప్రచారం కోసం ఎల్ఈడీ లైట్లతో కూడిన ఓ భారీ హైడ్రోజన్ నింపిన బెలూన్ ను ఏర్పాటు చేశారు. శనివారం అర్ధరాత్రి గాలి వీచి బెలూన్ పక్కనే ఉన్న కేవీ హైటెన్షన్ తీగలపై పడి పేలిపోయింది. అందులో ఉన్న ఎల్ఈడీ లైట్ల వైర్లు వెంచర్‌లోనే ఓ గుడిసెలో నిద్రిస్తున్న రాజుకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న వన్ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. రాజు సోదరుడు మంగేశ్ లిల్లారే ఫిర్యాదు మేరకు వెంచర్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. మృతుడు రాజుకు ఇప్పటికే నిశ్చితార్థం కాగా మే నెలలో పెళ్లి జరగాల్సి ఉంది. ఇంతలోనే ఈ ప్రమాదం జరగడంతో కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

పొలం వద్ద యువకుడు



నీరుడి రాజు(ఫైల్)

మర్కుక్(గజ్వేల్): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గంగాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. మర్కుక్ ఎస్ఐ మధుకర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన నీరుడి రాజు(27) ఆదివారం సొంత పొలానికి నీళ్లు పెడదామని వెళ్లాడు. కొండపోచమ్మ కాల్వలో వేసిన మోటార్ నడవకపోవడంతో దిగి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఇది గమనించిన చుట్టు పక్కల రైతులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మధుకర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అతివలు.. ఆర్థికంగా అడుగులు

- పీఎంఎఫ్ఎంఈ ద్వారా సబ్సిడీ రుణాలు
- సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు

చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రామ సమైక్య సంఘాల ఆధ్వర్యంలో మహిళలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని వివిధ వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా రాణిస్తున్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థికాభివృద్ధి సాధించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ స్కీం (పీఎంఎఫ్ఎంఈ) పథకం ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోంది. ఈ పథకం ద్వారా చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందే అవకాశం ఉంది. మండలంలో 1,240 స్వయం సహాయక సంఘాలు ఉండగా 13,014 మంది సభ్యులు ఉన్నారు. ఇప్పటి వరకు మండలంలో 23 మంది లబ్ధిదారులకు వివిధ చిన్నతరహా పరిశ్రమల నిమిత్తం రూ. 46 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి.

యూనిట్‌కు రూ. 10 లక్షలు..

మహిళలు హోటల్‌లు, కర్రీ పాయింట్లు, గిర్నీలు, పచ్చళ్ల తయారీ వంటి వాటిని ఏర్పాటు చేసుకోవచ్చు. మహిళా సంఘాల సభ్యులు ఐకేపీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.



చిన్నకోడూరులో కర్రీ పాయింట్ నడుపుతున్న మహిళ

దరఖాస్తుదారులకు సంబంధిత బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు సుముఖంగా ఉండాలి. గతంలో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించి ఉండాలి. అంతే కాకుండా మంచి సివిల్ స్కోర్ ఉన్నవారికి త్వరగా రుణం మంజూరయ్యే అవకాశం ఉంటుంది. తాము ఏ పరిశ్రమ స్థాపించాలనుకుంటున్నారు.. ఎంత నగదు అవసరమో బ్యాంకు అధికారులకు వివరించాలి. గరిష్టంగా రూ.10 లక్షల వరకు రుణం తీసుకునే అవకాశం ఉంటుంది. తీసుకున్న రుణంలో 35 శాతం రాయితీ ఉంటుంది. ప్రతీ నెలా వాయిదా పద్ధతిలో చెల్లించాలి.

ఫుట్‌వేర్ షాపు పెట్టుకున్నా..



ప్రభుత్వం అందించే రుణం తీసుకొని ఫుట్‌వేర్ షాపు పెట్టుకున్నా. కొంత మేరకు కుటుంబానికి ఆర్థికంగా ఇబ్బందులు తగ్గాయి. ఇంటి అవసరాలు తీరాయి. భవిష్యత్‌లో మరింత రుణం తీసుకొని ఈ వ్యాపారాన్ని మరింత విస్తరిస్తా.

–లక్ష్మి, ఫుట్‌వేర్ షాపు నిర్వాహకురాలు

మహిళ బ్యాగులో బంగారం చోరీ



బాధితురాలు రాణి

మెదక్ మున్సిపాలిటీ: మహిళ బ్యాగులో నుంచి బంగారం చోరీకి గురైన ఘటన ఆదివారం మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. హవేళీఘనపూర్ మండలం కూచన్‌పల్లి గ్రామానికి చెందిన మల్లికార్జున రాణి కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం వెళ్లేందుకు మెదక్ బస్టాండ్‌లో బస్సు కోసం కుర్చుంది. చాలా సేపటి తర్వాత బస్ రావడంతో ఎక్కి కండక్టర్‌కు ఆధార్‌కార్డు చూపేందుకు బ్యాగ్‌లో చేయి పెట్టింది. ఈ క్రమంలో బ్యాగ్‌లో ఉండాల్సిన సుమారు 8 తులాల బంగారం కనిపించలేదు. వెంటనే మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రెండు బైక్‌లు ఢీ

తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలైన ఘటన తూప్రాన్-నర్సాపూర్ హైవే చండి గ్రామ బస్టాండు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి గూడూర్ గ్రామానికి చెందిన కటిక అమిద్ చండి గ్రామంలో చికెన్ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం అమిద్ కొడుకు జావిద్‌తో కలిసి దుకాణం తెరిచేందుకు బైక్‌పై చండి గ్రామానికి బయలుదేరాడు. జహీరాబాద్‌కు చెందిన సామ్యూల్, అవినాష్‌లు బైక్ పై తూప్రాన్ నుంచి నర్సాపూర్‌కు వేగంగా వస్తూ అమిద్ బైక్‌ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం సూరారంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ప్రమాదంలో సామ్యూల్, అవినాష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు జావిద్, అమిద్

హెడ్ కానిస్టేబుల్ మృతి

అంత్యక్రియల్లో పాల్గొన్న ఏఆర్ అడిషనల్ డీసీపీ

మిరుదొడ్డి(దుబ్బాక): అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ శనివారం మృతి చెందారు. మండల పరిధిలోని కాసులాబాద్‌కు చెందిన గోవిందారం తిరుపతి (52) సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకోసం ఆస్పత్రిలో చేరగా అక్కడ చనిపోయారు. స్వగ్రామంలో ఆదివారం నిర్వహించిన అంత్యక్రియలకు ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పర్శరాములు, దుబ్బాక ఎస్ఐ గంగరాజు, భూంపల్లి ఎస్ ఐ భువనేశ్వర్‌రావు, చిన్నకోడూర్ ఎస్ఐ బాలకృష్ణ,పోలీస్ స్పెషల్ బ్రాంచ్‌సిబ్బంది, అధికారులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వ తరఫున రూ. 20 వేలు అందించారు. కుటుంబ సభ్యులతో సీపీ డా. బి.అనురాధ ఫోన్ ద్వారా మాట్లాడి పరామర్శించా రు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న సుభాష్ చంద్రబోస్

ఆశల పూత.. నిలబడేనా కాత

- రెండేళ్లుగా నష్టపోతున్న రైతులు
- జాగ్రత్తలు పాటిస్తే మేలు
- ఉద్యానవన అధికారి శైలజ

జహీరాబాద్ టౌన్: మామిడి రైతులకు రెండేళ్ల నుంచి కష్టాలు తప్పడం లేదు. గతేడాది వర్షాల కారణంగా ఆలస్యంగా పూత పూసినా.. తెగుళ్ల ప్రభావం వల్ల పిందెలు రాలి కాత నిలబడలేదు. అంతంత మాత్రంగా ఉన్న కాత కూడా అకాల వర్షాలకు నేలరాలి పోయింది. దిగుబడి గణనీయంగా తగ్గి మామిడి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఈ ఏడాది కూడా వాతావరణ పరిస్థితుల కారణంగా ఆలస్యంగా పూత పూసింది. ఈ క్రమంలో మామిడి చేతికి వచ్చే సమయానికి పూత, పిందె రాలిపోయే ప్రమాదం ఉంది. పలు రకాల తెగుళ్లు ఆశించి నష్టాన్ని చేకూరుస్తాయి. ఎప్పటికప్పుడూ సస్యరక్షణ చర్యలు చేపడితే మేలని జహీరాబాద్ ఉద్యాన వనాధికారిణి శైలం రైతులకు సూచిస్తున్నారు.

జిల్లాలోని జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో అధిక శాతం మామిడి తోటలు ఉన్నాయి. జహీరాబాద్ ప్రాంతం నేల మామిడికి అనుకూలంగా ఉండడంతో వందల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. బంగినపల్లి, పెద్ద రసాలు, చిన్న రసాలు, కెసరి, మల్లిక, హిమాయత్, దసేహరి, మహమూద, తెల్ల గులాబి, పాపరావు గోవా, నీలాలు, తౌతపరి, గోల, దేశి తదితర రకాల మామిడి తోటలు రైతులు పెంచుతున్నారు.

యాజమాన్య పద్ధతులు

- ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల వరకు మామిడిలో యాజమాన్య చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు వస్తాయి. మూడు నెలలపాటు యూరియా, పొటాష్, బోరాన్ ఎరువులు వినియోగించాలి. మందులు ఒకేసారి కాకుండా పలు దఫాలుగా వేయాలి.
- పదేళ్లు పైబడిన చెట్లకు 700 గ్రాములు డీఏపీ, 400 గ్రాములు యూరియా, 600 గ్రాముల ఎంవోపీ మందును కలిపి వేసి క్రమం తప్పకుండా నీటి తడులు పెట్టాలి.

బూడిద తెగులు

- మామిడికి పూత దశలో బూడిద తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. వేర్లు ఆయా భాగాల నుంచి పోషకాలు, నీటిని పీల్చడం వల్ల పూత, పిందెలు నల్లగా మారి రాలిపోతాయి.
- కాగితంపై దులిపితే పేను వంటి నల్లటి తామర పురుగులు కనిపిస్తాయి. నివారణకు 150 గ్రాములు థయోమిథామిక్సిమ్ లీటరు హెక్సాకోనాజోల్ మందు 500 లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- తెగులు తీవ్రత ఉధృతంగా ఉంటే 40 శాతం ఫిప్రోనిల్, 40 శాతం ఇమిడాక్లోప్రిడ్ 150 గ్రాములు ట్రిబుకోనజోల్ 250 గ్రా, 500 లీటర్ల నీటిలో కలిపి చల్లితే మంచి ఫలితం ఉంటుంది.

తామర పురుగు

- తామర, తేనె మంచు పురుగులు చేరి ఆకులు, పిందెల నుంచి రసాన్ని పీల్చి రాలిపోయేలా చేస్తాయి. ఉధృతి ఎక్కువగా ఉంటే ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పూత, పిందె సమయంలో వర్షాలు కురిస్తే తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది.



జహీరాబాద్ ప్రాంతంలో మామిడి తోటలకు పూసిన పూత

పిందె రాలకుండా చర్యలు

- పూత పిందెగా మారి బఠాని గింజ సైజులో ఉన్నప్పుడు పసుపు రంగులోకి మారి రాలిపోతుంటే నివారణకు 2.5 కిలోల ఫార్ములా 4 లేదా 2.5 కిలోల ఫార్ములా 6, ప్లానోఫిక్స్ 100 మిల్లీ లీటర్లను 500 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పండు ఈగ వల్ల కూడా పిందె రాలుతుంది. నివారణకు లింగాకర్షక బుట్టలను ఎకరానికి 10 నుంచి 30 వరకు ఏర్పాటు చేయాలి.

నేడు ఆపరేషన్.. ఇంతలోనే గుండెపోటు

ఆలయ పూజారి కన్నుమూత



లక్ష్మణచారి(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ పూజారి కొక్కరకుంట లక్ష్మణచారి ఆదివారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. గాయని శార్వాని తలకొరివి పెట్టి తండ్రి రుణం తీర్చుకోవడం విషాదం నింపింది. కొద్ది రోజుల కిందటే లక్ష్మణచారి గుండె సంబంధ వ్యాధితో బాధపడుతూ వైద్యులను సంప్రదించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఈ నెల 26న ఓపెన్ హార్ట్ సర్జరీ చేసేందుకు సమయం ఇచ్చారు. వైద్యులు ఇచ్చిన సమయానికి ఒక రోజు ముందే గుండెపోటుతో చనిపోవడంతో స్థానికంగా విషాదం నింపింది. లక్ష్మణచారి ఆలయ పూజారిగా చేస్తూనే టీవీ మెకానిక్‌గా సేవలు పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. భార్య సరస్వతీ, శార్వాణి, శరణ్య, శ్వేత ముగ్గురు ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ఇందులో శార్వాణిని హైదరాబాద్‌లోని ప్రముఖ సంగీత అకాడమీలో శిక్షణ తీసుకొని ప్రస్తుతం సినిమా గాయకురాలుగా ఎదిగింది. ఆలయ పూజారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



తండ్రికి తలకొరివి పెడుతున్న కూతురు శార్వాణి